సాక్షి మంచిర్యాల

శుక్రవారం । 16 । జూన్ । 2023



సమస్యలపై జీపు జాత

తాండూర్: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి ఈ నెల 20 నుంచి జీపు జాత నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లాసహాయ కార్యదర్శి దాగం రాజారాం తెలిపారు. గురువారం ఐబీ కేంద్రంలో జీపు జాత వాల్‌పోస్టర్లు విడుదల చేశారు.



పోడు రైతుల విడుదల

చెన్నూర్‌రూరల్: జైలు నుంచి విడుదలైన పోడు రైతులకు మండలంలోని అక్కెపల్లి గ్రామంలో గురువారం స్వాగతం పలికారు. మే 26న ఫారెస్టు అధికారులు, రైతులకు జరిగిన ఘర్షణలో ఆరుగురు జైలుకు వెళ్లిన విషయం తెలిసిందే.

గరిష్టం/కనిష్టం
42.0 /32.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. రాత్రివేళ పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వడ గాలులు వీస్తాయి. ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విదార్థులకు ప్రతిభా పురస్కారాలు



విద్యార్థులతో అదనపు కలెక్టర్ రాహుల్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): సేవాభారతి ఆధ్వర్యంలో రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ సహకారంతో మండల స్థాయిలోని 19 ప్రభుత్వ పాఠశాలల్లో టాపర్లుగా నిలిచిన 25 మంది విద్యార్థులకు సేవా భారతి ప్రతిభా పురస్కారాలను అందజేశారు. విద్యార్థులకు జ్ఞాపిక, ప్రశంసాపత్రం, రూ.వెయ్యి నగదు ప్రోత్సాహాన్ని రఘునాథ్ ఫౌండేషన్ సహకారంతో అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు సొంత ఖర్చులతో హైదరాబాద్‌లోని కార్పొరేట్ కళాశాలలో ఉచిత విద్య అందిస్తుందని సేవాభారతీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రఘునాథ్ వెరబెల్లి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, సేవా భారతి రాష్ట్ర కో ఆర్డినేటర్ వాసూజీ, జిల్లా విద్యాధికారి యాదయ్య, ఎంఈఓ జాడి పోచయ్య, జిల్లా సైన్స్ అధికారి మధు, సేవా భారతి జిల్లా కో ఆర్డినేటర్‌లు రజిని, మంజుల పాల్గొన్నారు.

'తాగునీరు అందించడంలో విఫలం'



ఎన్టీఆర్ నగర్ కాలనీలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు

మంచిర్యాలటౌన్: తలాపునే గోదావరి నది ఉన్నా మంచిర్యాల పట్టణానికి తాగునీటిని అందించడంలో ఎమ్మెల్యే దివాకర్‌రావు విఫలమయ్యారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని 7వ వార్డు ఎన్టీఆర్ నగర్ కాలనీలో వాటర్ ట్యాంకు వద్ద మహిళలతో మాట్లాడారు. తాగునీరు రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని అన్నారు. సమస్యల పరిష్కారం కావాలంటే కేవలం బీజేపీతోనే సాధ్యం అవుతుందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారం ఇస్తే పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని హామీనిచ్చారు. నాయకులు పెద్దపల్లి పురుషోత్తం, అమిరిశెట్టి రాజు, బోయిని హరికృష్ణ, జోగుల శ్రీదేవి, కంకణాల సతీశ్, పట్టి వెంకటకృష్ణ, మెరెడికొండ శ్రీనివాస్, పూట్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులు ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్

మంచిర్యాలటౌన్: రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు నివాసంలో గురువారం ఎన్‌ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నాయకుల సమాశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో, దేశంలో త్వరలో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుందని, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ నిరంకుశ పాలనను తరిమి కొట్టేందుకు విద్యార్థులు పనిచేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ కాంపిటీషన్ పోటీలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెండం రాజు, జిల్లా అధ్యక్షుడు ఆదర్శ్ వర్ధన్, జాతీయ కోఆర్డినేటర్ ఫరాజ్, అఖిలేశ్ యాదవ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సోహెల్ పాల్గొన్నారు.

చినుకుపై చింత..!



విత్తనాలు వేసేందుకు సిద్ధం

రోహిణి కార్తె ఆరంభంతో చేను చదును చేసి దుక్కి దున్ని సిద్ధం చేసుకున్న. మృగశిర కార్తె నుంచి ఎప్పుడు వర్షాలు పడితే అప్పుడు పత్తి విత్తనం వేద్దామని ఎదురుచూస్తున్న. మృగశిర కార్తె వెళ్లి వారం గడుస్తున్నా చినుకు రాలడం లేదు. పొద్దంతా విపరీతమైన ఎండ కొడుతోంది. సాయంత్రం ఈదురు గాలులు పెడుతున్నయి తప్ప చినుకు పడం లేదు. పోయినేడాది భారీ వర్షాలకు వరదల్లో పంట నష్టం వాటిల్లింది. ఈ ఏడాది వానాకాలం ఆలస్యమయ్యేటట్లు ఉంది.

– రైతు బీరుదు అంజన్న, నెన్నెల

గత ఐదు రోజులుగా ఉష్ణోగ్రతలు

తేదీ	గరిష్టం	కనిష్టం
11	42.6	28.6
12	42.8	27.4
13	43.4	28.0
14	43.8	29.2
15	42.1	28.6

- పలుకరించని తొలకరి వర్షాలు
- వానాకాలం సాగుపై రైతుల కలవరం
- అదును దాటుతోందని ఆందోళన

మంచిర్యాలఅగ్రికల్చర్: తొలకరి వర్షాలు పలుకరించకపోవడంతో రైతుల్లో కలవరం మొదలైంది. జూన్ నెల ప్రారంభమై 15రోజులు.. మృగశిర కార్తె ఆరంభమై వారం గడుస్తోంది. ఇప్పటికే చేన్లు దుక్కులు దున్ని విత్తనాలు, ఎరువులు వేసేందుకు రైతాంగం సిద్ధమైంది. సకాలంలో తొలకరి వర్షాలు కురిస్తే ఇప్పటికే విత్తనాలు వేయాల్సింది. సాగు ఆలస్యమవుతుందనే ఉద్దేశంతో కొందరు పొడిలోనే విత్తనాలు వేస్తున్నారు. గత ఏడాది ఈ సమయానికే వర్షాలు కురిసి విత్తనాలు వేసుకోగా.. ఈ ఏడాది వాతావరణం భిన్నంగా కనిపిస్తోంది. ఈ సమయానికే రుతు పవనాలు జిల్లాను తాకి జోరు వర్షాలు కురువాల్సి ఉండగా.. మేఘాలు సాయంత్రం అక్కడక్కడ కమ్ముకున్నట్టే కమ్ముకుని అట్టే కనుమరుగై చినుకు రాలడం లేదు. గత వారం రోజులుగా జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 25 నుంచి 30 డిగ్రీల మధ్య, గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42 నుంచి 45డిగ్రీల మధ్య నమోదు అవుతున్నాయి. ఉదయం 8గంటల నుంచే ఎండలు మండిపోతుండగా.. వర్షం ఎప్పుడు పడుతుందోనని రైతులు ఎదురు చూస్తున్నారు.

సారవంతం చేసుకుని

మృగశిర కార్తె ఆగమనంతో అన్నదాతలు వ్యవసాయ పనులు వేగవంతం చేశారు. సమయానికి బ్యాంకు రుణాలు అందకపోయినా అప్పు చేసి విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ సామగ్రి సమకూర్చుకుంటున్నారు. ఇప్పటికే చాలామంది రైతులు విత్తనాలు వేయడానికి సిద్ధం చేసుకున్నారు. తొలకరి వర్షాలు పడితే ఈ సమయానికి 25శాతం మంది రైతులు పంటలు విత్తకోవాల్సి ఉండేది. గత ఏడాది జూన్ రెండో వారం నుంచే నైరుతి రుతు పవనాలు విస్తరించి వర్షాలు కురవడంతో పత్తి, కంది పంటలు విత్తుకున్నారు. కానీ ఈ ఏడాది వర్షాలేక రైతుల్లో చింత కనిపిస్తోంది. అదును దాటుతోందని ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ఆందోళన అవసరం లేదని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని, రుతుపవనాల రాక ఆలస్యమైనా గాబరా పడాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. ఈ వానాకాలం సాగు రైతులకు కలిసి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

3.60లక్షల ఎకరాల్లో..

జిల్లాలో ఈ ఏడాది 3.60 లక్షల ఎకరాల వరకు పంటలు సాగవుతాయని, అధికారులు విత్తనాలు, ఎరువులు సిద్ధం చేశారు. జిల్లాలో పత్తి, వరి సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉంటుంది. ఈ ఏడాది 1.80 లక్షల ఎకరాల్లో పత్తి, 1.60 ఎకరాల్లో వరి సాగు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వం సేంద్రియ కర్షనంగా వాడే పచ్చిరొట్ట విత్తనాలు మాత్రమే అందిస్తోంది. ఇప్పటికే మండలాల్లో వ్యవసాయ అధికారులు 5500 క్వింటాళ్ల జీలుగ, జనుము రాయితీ విత్తనాలు అందజేస్తున్నారు. పత్తి, కంది, వరి, మొక్కజొన్న తదితర విత్తనాలు ప్రైవేటు డీలర్ల వద్ద కొనుగోలు చేస్తున్నారు. 3.60 లక్షల పత్తి విత్తనాలు ప్యాకెట్లు రైతులకు అవసరమని ప్రైవేట్ డీలర్ల వద్ద అందుబాటులో ఉంచారు. 80 వేల మెట్రిక్ టన్నులు యూరియా, డీఏపీ, కాంప్లెక్స్, పొటాష్ తదితర ఎరువులు ఉన్నాయి. జిల్లాలో పంటల సాగు కోసం ఇప్పటికే 24 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.

ఎల్‌నినో ప్రభావం ఏమాత్రం..?

నైరుతి రుతుపవనాల రాక ఆలస్యమైన రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందా లేక.. ఆశించిన వర్షాలు లేక కరువు పరిస్థితులు నెలకొంటయోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గత జూన్ సాధారణ వర్షపాతం కురవగా జూలైలో భారీ వర్షాలతో రెట్టింపు వర్షపాతం నమోదైంది. వాగులు, ఒర్రెలు వరదలతో ఉప్పొంగి ప్రవహించాయి. చెరువులకు గండ్లు పడ్డాయి. లోతట్టు ప్రాంతాల్లోని పంట పొలాలు నీటి మునిగి నష్టపోయారు.

అభివృద్ధి దిశగా పల్లెలు



మల్టీపర్పస్ వర్కర్స్‌ను సన్మానిస్తున్న రాహుల్

జైపూర్: పల్లెల్లో అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం అన్ని రకాలుగా చర్యలు చేపడుతోంది జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కాన్కూర్ గ్రామ పంచాయతీలో గురువారం పల్లెప్రగతి దినోత్సవ వేడుకలు నిర్వహించారు. సర్పంచ్ వెంకటేశ్వర్‌గౌడ్ జెండా ఆవిష్కరించి గ్రామసభలో ప్రగతి నివేదికను వివరించారు. గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లను అదనపు శాలువాలతో సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోదారి రమాదేవి, జెడ్పీటీసీ మేడి సునిత, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులకు పురస్కారం

కాసిపేట/కోటపల్లి: కాసిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి పరీక్షల్లో అత్యధిక జీపీఏ పొందిన విద్యార్థిని దీక్షిత, ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్‌లతీఫ్‌లను జిల్లా అదనపు రాహుల్, డీఈఓ యాదయ్య ఘనంగా సన్మానించి మెమొంటో అందజేశారు. కోటపల్లి మండలం అన్నారం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి నితిన్ పదో తరగతిలో మండలస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినందుకు, హెచ్‌ఎం సురేందర్‌ను అదనపు కలెక్టర్ రాహుల్, సన్మానించారు. సేవా భారతి ప్రతిభ పురస్కారంలో భాగంగా మంచిర్యాల పద్మావతి గార్డెన్‌లో జరిగిన కార్యక్రమంలో అధికారులు సన్మానించారు.

డీటీడీవో ఉద్యోగులపై విచారణ జరిపించాలి

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని డీటీడీవో కార్యాలయం సిబ్బంది ఎనిమిది మంది బుధవారం గైర్హాజరు కావడంపై పూర్తి విచారణ జరిపించాలని టీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ కలెక్టరేట్ ఏవో సురేశ్‌కు వినతిపత్రం అందించారు. ఉద్యోగులు, కార్యాలయం ద్వారా ఖర్చు చేసిన నిధులపై పూర్తి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సీఆర్టీల నియామకం కోసం పలువురు అభ్యర్థులు వస్తే మూకుమ్మడిగా గైర్హాజరు కావడంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నిధుల్లేవు.. పనుల్లో జాప్యం



జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర థియేటర్ చౌరస్తాలో కూడలి నిర్మాణం

- నేడు పట్టణ ప్రగతి దినోత్సవ వేడుకలు
- ఐదు నెలలుగా విడుదల కాని నిధులు
- ముందుకు సాగని అభివృద్ధి పనులు

మంచిర్యాలటౌన్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వం రోజుకో శాఖకు సంబంధించిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తోంది. శుక్రవారం మున్సిపాలిటీల్లో 'తెలంగాణ పట్టణ ప్రగతి దినోత్సవం' నిర్వహణకు ఆదేశించింది. ఈ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీలో గత తొమ్మిదేళ్లుగా చేపట్టిన అభివృద్ధి పనులను ప్రగతి నివేదిక రూపంలో వివరించి, ఉత్తమ సేవలను అందిస్తున్న కార్మికులు, ఉద్యోగులు, అధికారులకు ప్రశంసాపత్రాలు అందించి, సన్మానించేలా ఏర్పాట్లు చేశారు. బల్దియాల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసేలా 2020 ఫిబ్రవరి నుంచి పట్టణ ప్రగతి కార్యక్రమం చేపట్టింది. ప్రతీ నెల మున్సిపాలిటీ జనాభా, వార్డుల ఆధారంగా నిధులు విడుదల చేస్తోంది. మొదటి రెండేళ్లపాటు ప్రతీ నెల నిధులు విడుదల చేసినా ఆ తర్వాత జాప్యం జరుగుతూ వస్తోంది. ఈ నిధులతో పట్టణంలోని రోడ్లు, డ్రెయినేజీలు, అత్యవసరంగా చేపట్టే పనులతోపాటు సుందరీకరణ, పార్కుల అభివృద్ధి, ఇతరత్రా పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటోంది. ఏటా వర్షాకాలం ప్రారంభంలో పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని 15 రోజులపాటు వార్డుల్లో నిర్వహించి, చెత్తాచెదారాన్ని తొలగించడం, డ్రెయినేజీల్లోని పూడికతీత పనులు చేసి, వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవడం వంటి కార్యక్రమాలు మూడేళ్లుగా చేపడుతున్నారు. ఈ ఏడాది పట్టణ ప్రగతి కార్యక్రమాలు చేపట్టకుండానే వర్షాకాలంలోకి అడుగు పెడుతుండగా, దశాబ్ది ఉత్సవాల పేరిట పట్టణ ప్రగతి వేడుకలను నిర్వహించుకోవడంపై విమర్శలు వస్తున్నాయి.

ఏడాదిగా...

జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లో పట్టణ ప్రగతి నిధులతో అభివృద్ధి పనులు చేస్తూ కొంత మేర సమస్యలు లేకుండా చేస్తున్నారు. గత ఏడాది నుంచి నిధుల విడుదలలో ఆలస్యం జరుగుతోంది. ఈ ఏడాది జనవరి నెల వరకే నిధులు విడుదల చేయగా ఫిబ్రవరి నెల నుంచి మే నెల వరకు నిధులు విడుదల కాలేదు. కోట్ల రూపాయలతో చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్లు అడుగుతున్నా నిధులు రాక చెల్లింపుల్లో జాప్యం జరుగుతోంది. దీంతో కాంట్రాక్టర్లు తప్పనిసరి పరిస్థితుల్లో చేపడుతున్న పనులను మధ్యలోనే నిలిపివేసే పరిస్థితి నెలకొంది. పట్టణ ప్రగతి నిధుల్లో కేంద్ర ప్రభుత్వానికి సమానంగా రాష్ట్ర ప్రభుత్వం నిధులను కలిపి ప్రతీ నెల ఆయా మున్సిపాలిటీలకు జనాభా ప్రాతిపదికన అందించాల్సి ఉంటుంది. ఏడాదిన్నరపాటు సక్రమంగా నిధులు ఇవ్వగా.. 2021 ఆగస్టులో 25 శాతం కోత విధించింది. మిగతా 75 శాతం నిధులు ప్రతి నెలా అందించడంలోనూ జాప్యం జరుగుతోంది. జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లో మంచిర్యాలకు అత్యధికంగా రూ. 23.36 కోట్లు విడుదల కాగా, అందులో పెద్ద మొత్తంలో రూ.4.5 కోట్లు పార్కుల అభివృద్ధికి, రూ.4.5 కోట్లతో రోడ్లు, రూ.4 కోట్లతో జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో జంక్షన్ల నిర్మాణం కోసం కేటాయించారు. నిధుల జాప్యంతో పనులు ముందుకు సాగడం లేదు.

జిల్లాలోని మున్సిపాలిటీలు, వార్డులు, పట్టణ ప్రగతి నిధుల వివరాలు

మున్సిపాలిటీ	వార్డులు	ఇప్పటికి విడుదలైన పట్టణ ప్రగతి నిధులు(రూ.కోట్లలో)	ఈ ఏడాది జనవరిలో విడుదలైన నిధులు(రూ.లక్షల్లో)
మంచిర్యాల	36	23.36	57
బెల్లంపల్లి	34	14.53	36
మందమర్రి	24	14.72	36
క్యాతన్‌పల్లి	22	10.42	25
లక్సెట్టిపేట	15	6.47	17
నస్పూర్	25	20.58	51
చెన్నూరు	18	6.94	17

'ధ్రువీకరణ' ఆలస్యం

- మీ సేవా కేంద్రాల్లో ప్రజల బారులు
- సర్వర్ సమస్యతో జారీలో జాప్యం
- రూ.లక్ష సాయం కోసం కుల, చేతివృత్తిదారుల పాట్లు



మంచిర్యాల మీసేవా కేంద్రంలో దరఖాస్తుదారులు

మంచిర్యాలటౌన్/దండేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం బీసీల్లోని కుల, చేతి వృత్తిదారులకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ నెల 20 చివరి తేదీ కావడంతో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం మీ సేవా కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకునే వారికి సర్వర్ తిప్పలు తప్పడం లేదు. ఓ వైపు ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేస్తుండగా, తహసీల్దార్ కార్యాలయంలోనూ ఆయా ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు సర్వర్ స్లో సమస్య ఉత్పన్నమవుతోంది. 2021-22, 2022-23లో తీసుకున్న ఆదాయ ధ్రువీకరణ పత్రం సమర్పించినా సరిపోతుందని ప్రభుత్వం ప్రకటించినా, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను తీసుకోని వారికే ఇబ్బందులు ఎక్కువగా ఉన్నాయి. దీంతో మీ సేవాలో దరఖాస్తు చేసిన వారు త్వరగా ఇచ్చేలా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. వీరితోపాటు ప్రస్తుతం పదో తరగతి పూర్తి చేసుకున్న వారు, ఇంజినీరింగ్, నీట్‌లో ఉత్తీర్ణత సాధించి, ఉన్నత చదువులకు వెళ్లే వారు సైతం ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో వెళ్తున్నారు. ఇక చేతి, కులవృత్తుల వారు దరఖాస్తుకు కులం, ఆదాయం, ఆహార భద్రత కార్డు, ఆధార్‌కార్డు, పాన్ కార్డులతోపాటు రెండు ఫొటోలు జతచేయాల్సి ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారు వార్షికాదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలలోపు వార్షికాదాయం ఉండాలని, గతంలో రూ.50 వేల రాయితీ రుణం తీసుకున్న వారికి ఈ పథకం వర్తించదని, ఒక కుటుంబంలో ఒకరికి మాత్రమే అవకాశం ఉంటుందనే నిబంధనలు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా సర్వర్ సమస్యతో ఇప్పటి వరకు 3 వేల మంది మాత్రమే దరఖాస్తు చేసుకోగా, గడువులోపు 15 వేలకు పైగా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. ఆన్‌లైన్‌లోని దరఖాస్తులను ఆయా మండలాల పరిధిలో ఎంపీడీవోలు, మున్సిపాలిటీల పరిధిలో మున్సిపల్ కమిషనర్లు పరిశీలించి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేస్తారు.

రెండేళ్ల క్రితం ఆదాయ ధ్రువీకరణ ఉన్నా

బీసీల్లోని చేతి, కులవృత్తులు చేసుకునే వారికి ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సాయం పూర్తి రాయితీతో అందించేందుకు tsopmms.cgg.go v.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తోంది. 2021-22, 2022 -23 లో తీసుకున్న ఆధాయ ధ్రువీకరణ పత్రాలు ఉన్నా దరఖాస్తు చేసుకోవచ్చు. – వినోద్, బీసీ సంక్షేమ అధికారి

సర్వర్ సమస్య ఉంది..

ఆన్‌లైన్ సర్వర్ సరిగా పనిచేయడం లేదు. అంతటా ఇదే సమస్య ఉంది. సర్వర్ సరిగా పనిచేయకపోవడంతో సకాలంలో ధ్రువపత్రాలు జారీ చేయలేకపోతున్నాం. పనిచేసే సమయంలో ధ్రువపత్రాలు అప్రూవల్ చేస్తూ జారీ చేస్తున్నాం.

– హన్మంతరావు, తహసీల్దార్, దండేపల్లి

- జిల్లాలోని ఓ ప్రభుత్వ టీచర్ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఎండవేడిమి తగలకుండా చూసుకోవాలని వైద్యుడు సూచించారు. తీవ్రమైన వడగాల్పుల నుంచి రక్షణకు పాఠశాలలో ఓ కూలర్ ఏర్పాటు చేసుకోవాల్సి వచ్చింది.
- పాఠశాలలు పునఃప్రారంభమైనా విద్యార్థుల హాజరుశాతం పెరగడం లేదు. దీంతో ఆయా గ్రామాల్లో ఉన్న విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు వెళ్లాల్సి వస్తోంది. 'ఎండలు బాగున్నాయి.. చిన్న పిల్లలు కదా' అని తల్లిదండ్రులు చెప్పడంతో వెనుదిరుగుతున్నారు.

ఎండకు భయపడి.. బడికి దూరం..!

- బడిబాటపట్టని విద్యార్థులు
- తీవ్రమవుతున్న వడగాల్పులు




జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల తరగతి గదిలో విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో రోజు రోజుకు భానుడి భగభగలకు ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం 9గంటల నుంచే ఎండలు మండిపోతున్నాయి. ఫ్యాన్లు, కూలర్లు సైతం ఎండ వేడిమి నుంచి ఉపశమనం కలిగించడం లేదు. మధ్యాహ్నం పూట బయటకు రావాలంటే భయపడే పరిస్థితులున్నాయి. ఈ నెల 12న పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగిస్తోంది. రెండు పూటల బడులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో 1046 పాఠశాలలుండగా 1,15,324 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఎంపీపీ, జెడ్పీపీ 683 పాఠశాలల్లో 37,207 మంది, 30 ప్రభుత్వ పాఠశాలల్లో 2648 మంది చదువుతున్నారు. ఈ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం 15 నుంచి 20వరకు నమోదైనట్లు తెలుస్తోంది. ఆశ్రమ, రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం రెండంకెలు కూడా దాటని పరిస్థితి. ప్రతీరోజు వసతిగృహలతో కూడిన విద్యాలయాల ప్రిన్సిపాల్, ఎస్‌వోలు పిల్లలకు ఫోన్ చేసి రమ్మని చెబుతున్నా ఎండలు తగ్గాక వస్తామంటూ దాటవేస్తున్నట్లు తెలుస్తోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలల్లోనే ఉండాల్సి రావడంతో కొందరు విద్యార్థులు వాంతులు, విరేచనాల బారిన పడుతున్నట్లు తెలుస్తోంది. ఒకరోజు వచ్చిన విద్యార్థి మరో రోజు రావటం లేదని తెలుస్తోంది. ఈ నెల 20న విద్యా దినోత్సవం రోజున పుస్తకాలు అందించనుండడంతో పుస్తకాలు లేకుండానే పాఠాలు సాగుతున్నాయి.

వసతి గృహాల్లో..

వసతితో కూడిన విద్యాలయాల్లో మరోలా ఉంది. తొమ్మిది టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ సొసైటీ స్కూళ్లలో 2605 మంది విద్యార్థులు చదువుతున్నారు. టీఎస్‌ఆర్‌ఈఐ సొసైటీ స్కూల్‌లో 581మంది, 16 టీడబ్ల్యూ డిపార్ట్‌మెంట్ ఆశ్రమ పాఠశాలల్లో 2668 మంది, అర్బన్ రెసిడెన్షియల్‌లో 88 మంది, 18 కేజీబీవీల్లో 4405 మంది అభ్యసిస్తున్నారు. ఐదు మోడల్‌స్కూళ్లలో 3,399, ఎనిమిది ఎంజేపీటీబీసీడబ్ల్యూ ఆర్‌ఈఐఎస్ స్కూళ్లలో 3342 మంది చదువుతున్నారు.

ఒంటిపూట పెడితే బాగుంటుంది..



ఎండలు బాగా ఉన్నాయి.. ఇంట్లోనే కూలర్ తిరుగుతుంటే తట్టుకో లేకపోతున్నాం. బడిలో పిల్లలు ఉండలేని పరిస్థితి. ఫ్యాన్ ఉన్నా వడ గాల్పులతో ఇబ్బందిగా ఉంది. అందుకే మా బాబును మధ్యాహ్నం వచ్చి ఇంటికి తీసుకెళ్తున్నా. ఒక్కపూట బడిపెడితే మంచిగుండు.. చల్లబడే వరకు రెండు పూటలకు పంపాలంటే భయంగా ఉంది.

– సుజాత, పేరెంట్

నాలుగురోజుల గడుస్తున్నా పట్టుమని పదిమంది కూడా రాని పరిస్థితి. వాతావరణం చల్లబడే వరకైనా పాఠశాలలు వేళలు మార్చడం.. ఒంటిపూట బడులపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

లాసెట్‌లో 182వ ర్యాంక్


రాజశేఖర్

చెన్నూర్: జిల్లాకు చెందిన విద్యార్థి లాసెట్‌లో రాష్ట్రస్థాయిలో 182వ ర్యాంకు సాధించాడు. కోటపల్లి మండలం రొయ్యలపల్లికి చెందిన నిరుపేద వ్యవసాయ కూలీ అక్కెం రాజం, పోశక్క దంపతుల కుమారుడైన రాజశేఖర్ పట్టణంలోని మైనార్టీ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశాడు. మైనార్టీ కళాశాలకు చెందిన 9 మంది విద్యార్థులు లాసెట్‌కు హాజరుకాగా ఆరుగురు క్వాలీఫై అయినట్లు ప్రిన్సిపాల్ తిరుపతి తెలిపారు. విద్యార్థి రాజశేఖర్‌ను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

నీట్‌లో మెరిసిన గురుకుల ఆణిముత్యం


విద్యార్థినిని అభినందిస్తున్న ఎమ్మెల్యే

బెల్లంపల్లి: నీట్ ఫలితాల్లో ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకులం విద్యార్థిని ఐనాల సొగంధి యశస్విని అత్యుత్తమ ప్రతిభ కనబర్చింది. బెల్లంపల్లి సంక్షేమ బాలుర సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీవోఈ) కళాశాల ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, జానకి దంపతుల కూతురు సొగంధి యశస్విని బెల్లంపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో పదోతరగతి వరకు చదువుకుంది. హైదరాబాద్ గౌలిదొడ్డి సీవోఈ కళాశాలలో చేరి ఇంటర్‌లో 960మార్కులు సాధించింది. 2023 నీట్ పరీక్షకు హాజరై జాతీయస్థాయిలో 11,329 ర్యాంకు సాధించింది. గురువారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సదరు విద్యార్థినిని అభినందించారు.

ఈసెట్‌లో సింగరేణి విద్యార్థుల ప్రతిభ

శ్రీరాంపూర్(మంచిర్యాల): ఈసెట్–2023 ఫలితాల్లో సీసీసీలోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించినట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆనంద్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డీ.సాద్విక్ (మెకానికల్) 4వ ర్యాంక్, బీ.సాహిత్ కుమార్(మైనింగ్) 5వ ర్యాంకు, డీ.సంజయ్‌కుమార్ (మైనింగ్) 13వ ర్యాంకు, యూ.నిఖిల్ తేజ(ఎలక్ట్రికల్)17వ ర్యాంకు, టీ. చిన్మయి (మైనింగ్) 19వ ర్యాంకు, పీ.వరుణ్ (కంప్యూటర్)లో 25వ ర్యాంకు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. సదరు విద్యార్థులను జీఎం (ఎడ్యుకేషన్) ఎన్.వెంకటేశ్వర్‌రావు, ఏరియా జీఎం బీ.సంజీవరెడ్డి, కరస్పాండెంట్ ఏ.రాజేశ్వర్ అభినందించారు.

WANTED TEACHERS
Reputed English Medium School in Bellampally require Teachers for Hindi, English & Maths High School
Contact
9177285348
8328676615

వైద్యం కోసం వెళ్లొస్తూ..

అనారోగ్యంతో బాధపడుతున్న కుమారుడికి వైద్యం చేయించేందుకు తీసుకెళ్లారు తల్లిదండ్రులు. ఎండాకాలమని ఉదయమే ద్విచక్రవాహనంపై ముగ్గురూ బయల్దేరారు. వైద్యుడి వద్దకు వెళ్లి చికిత్స చేయించారు. ఎండ కాకముందే ఇల్లు చేరాలని తిరుగు పయనమయ్యారు. కానీ, ఆ తండ్రీ కొడుకులకు అదే చివరి ప్రయాణమైంది. ట్రాక్టర్ రూపంలో ఎదురొచ్చిన మృత్యువు ఇద్దరిని కబళించింది. ఈ ఘటనలో తల్లికి తీవ్ర గాయాలయ్యాయి. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాద ఘటన పర్యావసనాలు.


ఆస్పత్రి వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

- రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకుల దుర్మరణం
- తల్లికి తీవ్ర గాయాలు
- ట్రాక్టర్ రూపంలో దూసుకొచ్చిన మృత్యువు
- శ్రీరాంపూర్‌లో ఘటన

శ్రీరాంపూర్(మంచిర్యాల): మందమర్రి మండలం శంకర్‌పల్లికి చెందిన దర్శనాల రమేశ్ (40), వెన్నెల దంపతులకు కుమారుడు సూర్యతేజ (12), కూతురు సువిష్ణ (8) సంతానం. రమేశ్ తాపీమేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సూర్యతేజ మందమర్రిలోని మోడల్ స్కూల్‌లో ఏడోతరగతి, సువిష్ణ మూడో తరగతి చదువుతున్నారు. కుమారుడికి ఆరోగ్యం బాగాలేకపోవడంతో చికిత్స చేయించేందుకు తల్లిదండ్రులు గురువారం ఉదయం ద్విచక్ర వాహనంపై గోదావరిఖనికి బయలుదేరారు. చికిత్స అనంతరం మళ్లీ ఇంటికి తిరుగుపయనమయ్యారు. ఈక్రమంలో జీఎం కార్యాలయం వద్దకు రాగానే మందమర్రి వైపు తిరుగుతుండగా సిమెంట్ లోడ్‌తో అతివేగంగా వచ్చిన ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో తండ్రీకొడుకులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వెన్నెలకు తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు 108లో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆగమన్నా ఆగలే...

'వై జంక్షన్ వద్ద రోడ్డు క్రాస్ అవుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. రోడ్డు దాటుతుండగా మా బండి కొద్దిగా రోడ్డు మీదకు వచ్చింది. అప్పుడే ముందునుంచి స్పీడ్‌గా ట్రాక్టర్ వస్తుంటే నేను డ్రైవర్ కేసీ చేయి ఊపుతూ ఆగు.. ఆగు అని మొత్తుకున్నా.. అయినా స్పీడ్‌గా వచ్చి మాబండిని గుద్దిండు' అని వెన్నెల బోరున విలపిస్తూ తెలిపింది.

కానరాని హెచ్చరిక బోర్డులు

ప్రమాదస్థలం వై జంక్షన్‌లా ఉంటుంది. మల్లీడౌన్‌లో ఉంటుంది. ప్రమాదాలు జరుగకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. శ్రీరాంపూర్ నుంచి ఇందారంవెపు వెళ్లే వారికి మందమర్రి వైపు నుంచి వచ్చే వాహనాలు కనిపించకుండా రోడ్డు ఉంది. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు మందమర్రి సైడ్ తిరుగుతాయా? అన్న సంగతి కూడా తెలియక అలాగే వేగాన్ని కొనసాగిస్తున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ ఇలాగే స్పీడ్‌గా నడిపిఉంటాడని, అదే సమయంలో బైక్ వస్తుండటంతో కంట్రోల్ కాక ప్రమాదం చేసి ఉంటాడనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

భూత వైద్యం కోసమేనా?

సూర్యతేజ స్కూల్‌కు సక్రమంగా వెళ్లకుండా మారాం చేస్తుండడంతో దంపతులిద్దరూ కలిసి తమ కుమారుడిని గోదావరిఖనిలోని ఓ భూత వైద్యుని వద్దకు తీసుకెళ్లినట్లు తెలిసింది. తాయత్తు కట్టించడం కోసమే గురువారం గోదావరిఖనికి వెళ్లినట్లు బంధువులు భావిస్తున్నారు.

'వెన్నెల'కు చీకటే మిగిలింది


చికిత్స పొందుతున్న వెన్నెల

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెన్నెలకు జీవితంలో చీకటే మిగిలింది. జీవితాంతం తోడుగా ఉంటానన్న భర్త, పెద్దయ్యాక ఆసరాగా ఉంటాడను కన్న కుమారుడు ఇద్దరూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆమె జీవితం దుఃఖసముద్రంలో మునిగింది. ప్రమాదంలో రెండుకాళ్లు, చేయి విరగడంతో కదలలేని స్థితిలో ఉంది. ఏడుస్తున్న బిడ్డను దగ్గరకు తీసుకోలేని పరిస్థితిలో ఆమె రోదించడం పలువురిని కలిచివేసింది.

తండ్రి, సోదరుడు మార్చురీలో...తల్లి ఆస్పత్రిలో


రోదిస్తున్న సువిష్ణ

మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ వద్ద తండ్రి, సోదరుని మృతదేహాలు, బెడ్‌పై తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్న తల్లిని చూసి రోదిస్తున్న చిన్నారి సువిష్ణను ఆపడం ఎవరితరమూ కాలేదు. డాడీ లే... అన్నా లేరా. అంటూ చిన్నారి ఏడ్వడం అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది.

ఎంగేజ్‌మెంట్ తెల్లారే
యువకుడు దుర్మరణం


రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు, యువజన సంఘాల నాయకులు

- ఆసిఫాబాద్ వైపు నుంచి స్వగ్రామానికి వస్తుండగా రోడ్డు ప్రమాదం
- కుమారుడి మరణం తట్టుకోలేక తండ్రి ఆత్మహత్య
- వాంకిడి మండలం సామెలలో విషాదం


సంఘటన స్థలంలో మృతదేహం

వాంకిడి(ఆసిఫాబాద్): ప్రేమించిన యువతిని పెళ్లి చేసుకుని సంతోషంగా బతుకుదామనుకున్న ఆ యువకుడు ఎంగేజ్‌మెంట్ జరిగిన తెల్లవారే కానరాని లోకానికి వెళ్లిపోయాడు. కుమారుడి ఎదుగుదలను కళ్లారా చూద్దామనుకున్న ఆ తండ్రి కుమారుడి మరణవార్త విని తట్టుకోలేక పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ విషాదకర సంఘటన కుమురంభీం జిల్లా వాంకిడి మండలంలోని సామెల గ్రామంలో చోటు చేసుకుంది. మృతుల కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వాంకిడి మండలంలోని సామేల గ్రామానికి చెందిన వసాకె తులసీరాం(21) ఆసిఫాబాద్‌లోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. బుధవారం అదే గ్రామానికి చెందిన యువతితో ఎంగేజ్‌మెంట్ జరిగింది. కార్యక్రమానికి వచ్చిన బంధువుల్లో ఒకరిని దింపేందుకు గురువారం ఉదయం స్కూటీపై ఎల్లారం బయలుదేరాడు. తిరుగుప్రయాణంలో బుదల్‌ఘాట్ వాగు దాటాక జైత్‌పూర్ రోడ్డు వద్ద గల కంకర క్రషర్ సమీపంలో జాతీయ రహదారి–363పై ఎదురుగా వచ్చిన టిప్పర్ లారీ ఢీకొట్టింది. దీంతో తులసీరాంకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

పురుగుల మందుతాగి తండ్రి ఆత్మహత్య

సామెల గ్రామానికి చెందిన వసాకే భీంరావు (45)ది వ్యవసాయ కుటుంబం. గ్రామ ఉప సర్పంచ్‌గా కూడా సేవలందిస్తున్నాడు. అతనికి కూతురు కళావతి, కుమారుడు తులసీరాం సంతానం. కుమారుడి మరణవార్త తెలుసుకున్న భీంరావు మనస్తాపానికి గురయ్యాడు. ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు అంబులెన్స్‌లో ఆసిఫాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు.

జాతీయ రహదారిపై ఉద్రిక్తత

తండ్రీకొడుకుల మృతికి కారణమైన డీబీఎల్ కంపెనీ యాజమాన్యం తీరుకు నిరసనగా సంఘటన స్థలం వద్ద గ్రామస్తులు, బంధువులు, యువజన సంఘాల నాయకులు రాస్తారోకో నిర్వహించారు. బాధిత కుటుంబానికి రూ.25 లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తహశీల్దార్ రహీముద్దీన్, వాంకిడి సీఐ శ్రీనివాస్, ఆసిఫాబాద్ సీఐ రాణాప్రతాప్, ఎస్సైలు రమేశ్, సాగర్, గంగన్న కంపెనీ యాజమాన్యం, బాధిత కుటుంబ సభ్యులతో సంప్రదింపులు జరిపారు. రూ.19 లక్షలకు ఒప్పందం జరగడంతో ఆందోళన విరమించారు.

అలుముకున్న విషాదఛాయలు

ఎంగేజ్‌మెంట్ జరిగిన తెల్లారే యువకుడు మృతి చెందడం, కుమారుడి మరణవార్త విన్న తండ్రి పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకోవడంతో మండలంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రేమ దక్కడం లేదన్న ప్రతీకారంతోనే హత్య


వివరాలు వెల్లడిస్తున్న సీఐ అల్లం నరేందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): తనను ప్రేమించడంలేదన్న కోపంతో యువతి కుటుంబంపై పగ పెంచుకున్న యువకుడు స్నేహితులతో కలిసి ఆమె సోదరుడిని దారుణంగా హత్య చేసినట్లు రెబ్బెన సీఐ అల్లం నరేందర్ తెలిపారు. తిర్యాణి మండలంలోని ఉల్లిపిట్టలో ఈ నెల 1న జరిగిన హత్యకు సంబంధించిన వివరాలను గురువారం సీఐ వెల్లడించారు. ఉల్లిపిట్ట గ్రామానికి చెందిన బార్కుంట తరుణ్ అదే గ్రామానికి చెందిన యువతిని కొంతకాలంగా ప్రేమపేరుతో వేధిస్తున్నాడు. సదరు యువతి పలుమార్లు తిరస్కరించినా వెంటపడడం ఆగలేదు. దీంతో యువతి విషయాన్ని తన తల్లిదండ్రులకు చెప్పడంతో తరుణ్‌ను మందలించారు. అయినప్పటికీ అతనిలో మార్పురాకపోవడంతో తల్లిదండ్రులు తమ కుమార్తెను ఆదిలాబాద్‌లో ఉన్న మరో కూతురు ఇంటికి పంపించారు. అక్కడికి సైతం వెళ్లి వేధింపులకు పాల్పడేవాడు. అయినా తన ప్రేమను తిరస్కరించడంతో ఆమె కుటుంబంలో ఎవరినో ఒకర్ని అంతమొందించాలని అనుకున్నాడు. ఈ నెల 1న యువతీ తల్లి ఉపాధి హామీ పనులకు వెళ్లగా సోదరుడు ఉదయ్ కిరణ్ (14) ఇంట్లో ఒక్కడే ఉండడాన్ని గమనించిన తరుణ్, నరుణ్ ఇంట్లోకి ప్రవేశించి వెంట తెచ్చుకున్న గ్లౌజులు, టవెల్ సహాయంతో గొంతునులిమి హత్యచేశారు. కేసు దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. సమావేశంలో తిర్యాణి ఎస్సై సీహెచ్ రమేశ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

లక్సెట్టిపేట(మంచిర్యాల): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై లక్ష్మణ్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చందారం గ్రామానికి చెందిన ఉపేందర్ (28) గురువారం ద్విచక్ర వాహనంపై లక్సెట్టిపేటకు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. కేసు నమోదు చేసి మృతదేహన్ని పోస్టుమార్టంకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

మనసులో ఉంటే కుర్చో..బెంచీనో ఇవ్వాలి

- టీసీ కోసం ఇద్దరు ఉపాధ్యాయుల మధ్య సంభాషణ
- సోషల్ మీడియాలో చక్కర్లు

మంచిర్యాలఅర్బన్: హలో గుడ్ ఆఫ్టర్‌నూన్ సార్.. బాగున్నారా?.. పొద్దున నేనే వద్దామనుకున్నా.. బడిలో పని ఉండి రాలేకపోయా.. టీసీ కోసం పిల్లలు వస్తే మీరు డబ్బులడిగారట కదా?.. ఎవరు వచ్చిండ్రు.. సోని, శ్రీవల్లి, సంజనా, రక్షిత వచ్చి టీసీలు తీసుకెళ్లిపోయారు. డబ్బులు రేపైనా ఇవ్వమన్నారట. నేనే ట్రాన్స్‌ఫర్ చేస్తాను.. ఎవరు అడిగిండ్రు? వాళ్లకే ఇయ్యి.. అయినా మనసులో ఉంటే ఓ కుర్చో.. బెంచీనో ఇవ్వాలిగానీ.. మనకు వచ్చే జీతం చాలదాసార్? వాళ్లు ఇచ్చే కుర్చీలు, బెంచీలు కావాలా?.. అసలు మీకు, పిల్లలకు సంబంధం లేదు.. వారికి చదువు చెప్పింది మీరు కాదు.. ఇలాంటి వాటి గురించి నాకు ఫోన్ చేయొద్దు... ఎస్జీటీ టీచరు ఎస్జీటీ లెక్కనే మాట్లాడండి.. సరే నేను ఈ రికార్డును డీఈవో, ఆర్‌జేడీకి పంపిస్తాను బాయ్.. అంటూ ఇద్దరు ఉపాధ్యాయుల మధ్య సాగిన ఫోన్ సంభాషణ సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఏదేమైనా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పైతరగతులకు వెళ్లేందుకు టీసీలకోసం వెళ్తే ఉపాధ్యాయులు అడిగినంత ఇవ్వాల్సిందే. టీసీల కోసం పాఠశాలల్లో జరుగుతున్న 'మామూళ్ల'పై అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

పాదచారులను ఢీకొట్టిన కానిస్టేబుల్ బైక్

- ముగ్గురికి తీవ్రగాయాలు


గాయాలపాలైన బేతి రవి

శ్రీరాంపూర్(మంచిర్యాల): కానిస్టేబుల్ బైక్ ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. బెల్లంపల్లికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ నాగరాజు తన బైక్‌పై శ్రీరాంపూర్ నుంచి మందమర్రి వైపు వెళ్తున్నాడు. ఇదే సమయంలో స్థానిక వాసులైన కొలిపాక కుమారస్వామి, బేతి రవి నడుచుకుంటూ రోడ్డు దాటుతున్నారు. ఈక్రమంలో నాగరాజు బైక్ వారిని ఢీకొట్టింది. దీంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కుమారస్వామి, రవిని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి, నాగరాజును మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని ఎస్సై రాజేశ్ సందర్శించారు.

గుండెపోటుతో ఒకే రోజు ఇద్దరు మృతి


కామెర శ్రీనివాస్


గుంటి శ్రీశైలం

నెన్నెల(బెల్లంపల్లి): మండలంలో ఒకేరోజు ఇద్దరు గుండెపోటుతో మృతి చెందడంతో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. కోనంపేటకు చెందిన ఒగ్గు కళాకారుడు గుంటి శ్రీశైలం(55) గురువారం ఉదయం వాకింగ్‌కు వెళ్లివచ్చి ఇంటివద్దే కుప్పకూలాడు. కుటుంబ సభ్యులు ముందుగా మంచిర్యాలకు అక్కడి నుంచి కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య బాయమ్మ, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. ఆవుడం గ్రామానికి చెందిన పంచాయతీ కార్మికుడు కామెర శ్రీనివాస్(25) అతని తల్లి లక్ష్మిని ఉదయం అన్నం వండమని చెప్పాడు. నిమ్మకాయ పచ్చడి కావాలనడంతో తెచ్చేందుకు లక్ష్మి దుకాణానికి వెళ్లింది. ఇంటికి వచ్చేసరికే శ్రీనివాస్ కూర్చున్న చోటే చనిపోయాడు. మూడు నెలల క్రితం గుండెకు వాపు వచ్చిందని, చికిత్స అనంతరం బాగానే ఉన్నాడని మృతుని తల్లి రోదిస్తూ తెలిపింది.

వృద్ధుడి బలవన్మరణం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని టీకానపల్లి గ్రామానికి చెందిన పాలంపల్లి భీమయ్య(75) బుధవారం రాత్రి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. టీకానపల్లికి చెందిన భీమయ్య ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అంతేకాకుండా అతని కుమారుడు రెండేళ్ల క్రితం మృతి చెందడంతో అప్పటినుంచీ మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో బుధవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని మనుమడు కళ్యాణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం

కౌటాల: మండల కేంద్రంలోని నదిమాబాద్ కాలనీకి చెందిన కామ్రె శ్రీవాణి (17) అదృశ్యమైనట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఇటీవలే పదోతరగతి పూర్తి చేసిన బాలిక ముగ్గురు స్నేహితులతో కలిసి ఈ నెల 13న టీసీ కోసం సిర్పూర్(టి)లోని బాలికల గురుకుల పాఠశాలకు వెళ్లింది. అనంతరం స్నేహితులకు చెప్పకుండా అక్కడి నుంచి వెళ్లిపోయింది. సాయంత్రం వరకూ పాఠశాల వద్దే వేచిచూసి ఇంటికి వచ్చారు. విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో బంధువుల ఇళ్లలో వెతికారు. అయినా ఆచూకీ లభించలేదు. బాలిక తండ్రి గోవర్ధన్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య


వినయ్ (ఫైల్)

ఆసిఫాబాద్‌రూరల్: ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని వట్టి వాగుకాలనీలో గురువారం చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు, ఎస్సై గంగన్న తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వట్టివాగు (ఆర్‌ఆర్‌కాలనీ)కు చెందిన ఉయిగు వినయ్ (12) ఉట్నూర్‌లోని లాల్‌టెక్డీ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో బడికి వెళ్లాలని తల్లిదండ్రులు జంగు, కౌసల్య సూచించారు. నేను వెళ్లనని, ఇక్కడే ఉండి చదువుకుంటానని మారాం చేశాడు. తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో అక్కడికి వెళ్లడం ఇష్టంలేక సాయంత్రం ఇంటివద్దే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పొలంపనులకు వెళ్లిన తల్లిదండ్రులు ఇంటికి వచ్చి చూసేసరికి ఉరేసుకుని కనిపించాడు. పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై గంగన్న సంఘటన స్థలాన్ని సందర్శించారు. మృతుని తండ్రి జంగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో పని, సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయుల డిప్యూటేషన్‌లను నిష్పక్షపాతంగా, నిబంధనలను అనుసరించి కేటాయించాలని టీఎస్‌యుటీఎఫ్ ఆధ్వర్యంలో డీఈవో యాదయ్యను కోరారు. 2002 మే, జూన్‌లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు, ఓపెన్ 'పది', ఇంటర్ పరీక్ష విధులు నిర్వహించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అర్జిత సెలవులు మంజూరు చేయాలని కోరారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోళ్ల రామన్న, ప్రధాన కార్యదర్శి రాజావేణు, కార్యదర్శి కిరణ్‌కుమార్, కోశాధికారి కిరణ్ పాల్గొన్నారు.

చట్టాలు అమలు చేయాలి

పాతమంచిర్యాల: వయోవృద్ధుల సంరక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని తెలంగాణ బలహీన వర్గాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోతే రాజలింగు అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం 'ప్రపంచ వయోవృద్ధుల వేధింపుల అవగాహన దినోత్సవం' సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వయో వృద్ధుల సంరక్షణకు మెరుగైన వసతులు కల్పించాలని, అనాథ వృద్ధుల కోసం షెల్టర్ల నిర్మాణం చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు చిరంజీవి, శఠగోపం, మిరియాల తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

56 మంది గైర్హాజరు

మంచిర్యాలఅర్బన్: పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో గురువారం రెండో రోజు 56 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. సెకండ్ లాంగ్వేజ్ పరీక్షలకు గాను 15 మంది మాత్రమే హాజరుకాగా 56 మంది గైర్హాజరైనట్లు డీఈవో యాదయ్య తెలిపారు.

చిట్టీల పేరుతో శఠగోపం..!

- రూ.2 కోట్ల వరకు ఎగనామం
- లబోదిబో మంటున్న సభ్యులు

బెల్లంపల్లి: తాండూర్ మండలంలో ఓ చిట్టీల వ్యాపారి సభ్యులకు రూ.2 కోట్ల వరకు శఠగోపం పెట్టిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. తాండూర్ మండల కేంద్రానికి చేరువలో ఉన్న ఓ గ్రామానికి కొన్నాళ్ల క్రితం కరీంనగర్ జిల్లా నుంచి వలస వచ్చిన ఓ వ్యక్తి భవన నిర్మాణ రంగంలో పనికి కుదిరాడు. ఇళ్ల నిర్మాణాలు చేస్తూ చిట్టీల దందా ప్రారంభించాడు. గ్రామీణులకు నమ్మకం కలిగించి దాదాపు 10 వరకు చిట్టీ గ్రూపులు నిర్వహించాడు. సరిగ్గా నెలరోజుల క్రితం పరారీ కావడంతో ఘటన వెలుగు చూసింది. చిట్టీ గడువు ముగిసిన తర్వాత సదరు సభ్యుడికి డబ్బులు చెల్లించకుండా తనకే వడ్డీకి ఇవ్వాలని, అధికంగా వడ్డీ చెల్లిస్తానని మాయమాటలతో నమ్మించాడు. చుట్టుపక్కల ఉన్న ఐదారు గ్రామాల నుంచి పరిచయం ఉన్న ప్రతి వ్యక్తి వద్ద నుండి డబ్బులు దండుకున్నట్లు తెలుస్తోంది. మండల వ్యాప్తంగా దాదాపు 50 మంది వద్ద వడ్డీ, చిట్టీల వ్యాపారం ముసుగులో రూ.2 కోట్ల వరకు వసూలు చేసినట్లు సమాచారం. నెల రోజుల క్రితం అకస్మికంగా రాత్రికి రాత్రే ఉడాయించాడనే ప్రచారం జరుగుతోంది. తన భర్త కనిపించడంలేదని సదరు వ్యాపారి భార్య తాండూర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. ప్రస్తుతం సదరు చిట్టీల వ్యాపారి పరారీలో ఉండి అప్పులు ఇచ్చిన వ్యక్తులు, చిట్టీల సభ్యులకు కోర్టు నుండి ఐపీ నోటీసులు పంపించినట్లు ప్రచారంలో ఉంది.

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
(పూర్వం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా పిలవబడెను)
రిజిష్టర్ ఆఫీస్: ముకాంబికా కాంప్లెక్స్, 4, లెడి దెసికంచారి రోడ్, మైలాపూర్, చెన్నై.
బ్రాంచ్ ఆఫీస్: డోర్ నెం. 1-13-405/C, రుక్మిణి ఛాంబర్స్, సెకండ్ ఫ్లోర్, బ్లాక్ నెం. 203, వినాయకనగర్, నిజామాబాద్ - 503001

డిమాండ్ నోటీస్
(SARFAESI యాక్ట్ : 2002 లోని సెక్షన్ 13 సబ్ సెక్షన్(2) క్రింద)

SARFAESI చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మేము అనగా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (పూర్వం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా పిలవబడెను) మీ ద్వారా ఆఖరిగా తెలిపిన చిరునామాలకు డిమాండ్ నోటీస్ జారీ చేయడమైనది. కానీ మీరు తెలిపిన ఆ చిరునామాలలో లేనట్లుగా/ తిరుగు రశీదు లేకుండా మాకు తిరిగి వచ్చినవి. కావున దినపత్రికల ద్వారా నోటీసును ప్రచురించడమైనది. సదరు నోటీసు యొక్క విషయం ఏమనగా మీకు మంజూరు చేసిన రుణములపై గల బకాయిలను తిరిగి చెల్లించుటలో విఫలమైనారు. కావున క్రింద తెలిపిన బకాయి మొత్తము, భవిష్య వడ్డీ, ఛార్జీలు మొ॥గు వాటితో చెల్లించవలసిందిగా కోరడమైనది.

రుణగ్రహీత పేర్లు : (1) శ్రీ మహాలక్ష్మి అసోసియేట్స్ ప్రాతినిధ్యం వహించువారు కనవేణి శ్రీనివాస్, ఇంటి నెం. # 22-180/4-2, చున్నంబట్టివాడ, మంచిర్యాల, ఆదిలాబాద్, తెలంగాణ – 504 208.
(2) శ్రీ మహాలక్ష్మి అసోసియేట్స్ ప్రాతినిధ్యం వహించువారు మనెమ్ శ్రీనివాస్, తండ్రి పేరు: రాజయ్య, ఇంటి నెం. # 23-180/4-2, చున్నంబట్టివాడ, మంచిర్యాల, ఆదిలాబాద్, తెలంగాణ – 504 208.
ప్రస్తుత నివాస స్థలం : కనవేణి శ్రీనివాస్, తండ్రి పేరు: వెంకటయ్య, ఇంటి నెం. 5-7-526, హౌసింగ్ బోర్డ్ కాలనీ, కరీంనగర్, కరీంనగర్ జిల్లా, తెలంగాణ – 505 001.
నిరర్థక ఆస్తి తేది : 28.05.2021 **డిమాండ్ నోటీసు తేది:** 11.05.2023
రావల్సిన బకాయి మొత్తం : రూ. 45,00,917/- (20.04.2023 వరకు వడ్డీతో కలుపుకొని)
స్థిరాస్తి వివరణ : ప్లాట్ నెం. 14, సర్వే నెం. 197 లోని 200 చ.గ.ల విస్తీర్ణం గల గరిమిళ్ళ గ్రామం, మంచిర్యాల మండలం మరియు జిల్లా, ప్రస్తుత రిజిస్ట్రేషన్ జిల్లా మంచిర్యాల.
ఆస్తి యావత్తు సరిహద్దులు : **ఉత్తరం:** ప్లాట్ నెం. 15, **దక్షిణం:** ప్లాట్ నెం. 13, **తూర్పు:** అకుల రమేష్ యొక్క ప్లాట్, **పడమర:** 20 ఫీట్ల రోడ్డు.

ఒకవేళ పైన తెలిపిన మొత్తమును చెల్లించుటలో విఫలమైనచో శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు సదరు చట్టంలోని సదుపాయముల క్రింద సెక్యూర్డ్ ఆస్తులపై ఒకటి లేక అంతకు మించిన చర్యలను రికోర్స్ పద్ధతిలో మీ స్వంత బాధ్యతపై పర్యవసానముగా చేపట్టెదరు. సదరు చట్టం క్రింద శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు లభ్యమగు అధికారముల ప్రకారం (1) సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుట, లీజు, అసైన్‌మెంట్ లేదా అమ్మకం ద్వారా బదిలీ కొరకు హక్కుతో సహా రుణగ్రహీత యొక్క సెక్యూర్డ్ ఆస్తులకు స్వాధీనం చేసుకొనుట. (2) సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుట లీజు, అసైన్‌మెంట్ లేదా అమ్మకం ద్వారా బదిలీ కొరకు హక్కులతో సహా సెక్యూర్డ్ ఆస్తుల నిర్వహణ చేపట్టుట మరియు మీ ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ ద్వారా ఏదేని సెక్యూర్డ్ ఆస్తి బదిలీకి మొ. అందరిచే చేయబడిన బదిలీగా భావించబడి సెక్యూర్డ్ ఆస్తికి సంబంధించి అన్ని హక్కులను వినియోగించుకుంటుంది. ఈ నోటీసు స్వీకరణ తరువాత SARFAESI యాక్ట్‌లోని సెక్షన్ 13(3) లోని నిబంధనల ప్రకారం శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారి ముందస్తు వ్రాతపూర్వక అనుమతితో పైన తెలిపిన సెక్యూర్డ్ ఆస్తులపై అమ్మకము, లీజు ఇతర విధములైన (Other than in the ordinary course of your business) లావాదేవీలను జరుపుట నిషేధించడమైనది. SARFAESI యాక్ట్‌లోని సెక్షన్ 13(13)లోని నిబంధనలను ఉల్లంఘించినచో SARFAESI యాక్ట్‌లోని సెక్షన్ 29 క్రింద శిక్షార్హులు, సదరు చట్టంలోని సెక్షన్ 13(2) ప్రకారం ఈ నోటీసు జారీ చేయడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభ్యమయ్యే సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13(8)లోని నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీతను కోరడమైనది.

తేది: 16-06-2023 సం/-, **అధీకృత అధికారి,**
ప్రదేశం: నిజామాబాద్ **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్.**

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES
జ్యోతిష్యాలయం
■ శ్రీ కనకదుర్గ జ్యోతిష్యాలయం ఫోన్ ద్వారానే ఉచితంగా చెప్పబడును. విద్య ఉద్యోగం ఆరోగ్యం వ్యాపారం సంతానం ఎటువంటి సమస్యలు ఉన్న శాస్త్రి గారు తొమ్మిది రోజుల్లో శాశ్వత పరిష్కారం చెప్పబడును. సెల్: 9959782916 [1217056]

WANTED
■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను,పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను, ఫ్రీ వసతి + భోజనం, జీ: 18K ఏజెంట్స్ కమీషన్ 6K ఫోన్ : 9640258899 [H-793440]

www.sakshi.com

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

■ అర్జెంటుగా మూతపడ్డ కంపనీకి వాచ్‌మెన్, సూపర్‌వైజర్ కావలెను. సర్‌సిల్క్ కంపెనీ, సిర్పూర్ కాగజ్ నగర్, పేపర్ మిల్ ప్రక్కన (ఉచిత వసతి). ఫోన్ : 9440050086, 7569783139. [H-797699]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.